

త్రికాలపు మనిషి

— బలివాడ కాంతారావు

సీతారామప్రసాదు - గురించి యెవరైనా పెద్దగా అనుకున్నారా? అనుకోలేదు, అనుకోరన్న ధీమావుండబట్టే ఒకోసారి అతను చాలా తేలిగ్గా మాట్లాడేస్తుంటాడు. "పోదూ - వాడేం చేసాడు?" అని ప్రజలు బ్రహ్మరథం పట్టిన వాడినే చులకన చేసిన రోజులు లేకపోలేదు.

అతగాడికి యిష్టమైనవి చాలా వున్నయ్. అలా యిష్టం కావడానికి కారణాలూ వున్నయ్. ఉదాహరణకు — ఆఫీసులో తను రాసిన ప్రతి డ్రాఫ్టూ ప్రేమలేఖే అనుకుంటాడు. దానికి కారణం తన జీవితంలో ప్రేమలేఖలు రాసే కవిత్వం అబ్బినా రాసే అవకాశం దొరకలేదు. అతనికి తెలుగు సినిమాలంటే పరమ ప్రీతి దానికి కారణం తన భార్య కురూపి. అందమైన అబ్బాయిలను చూస్తే వరదా. అందులో ఆ అబ్బాయి గుణవంతుడైతే మమకారం. కారణం? ఉన్న ఒక్క కొడుక్కి తల వుంగరాల జుట్టుగానీ, హుందాయైన గొంతుకానీ, తనలోని ఒక్క సుగుణంగానీ అబ్బ లేదు.

తన క్రింద గుమాస్తాగా చేరిన దుర్గాప్రసాద్‌లో తన కొడుకెలా వుండాలని కాంక్షించాడో అన్ని గుణాలూ, అలాంటి రూపూ వున్నయ్. దుర్గాప్రసాద్ జీతం అందుకోగానే తండ్రికి మనియార్డరు చేసాక తను ఖర్చు పెట్టుకుంటాడు. ఆఫీసు టైముకు అయిదు నిమిషాలు ముందే వస్తాడు. అవసరమైతే గంట, అరగంట ఆలస్యంగా వెళ్లడానికి వెనుకాడడు. నేర్చుకోవాలన్న పట్టుదల వుంది. అందుకే దుర్గాప్రసాద్ చేరిన

మూడు నెలలకే ప్రభుకు అతనిమీద పుత్ర వాత్సల్యం కలిగింది. ఏడాదిలో దుర్గాప్రసాద్ లేకపోతే ఆఫీసులో యే పనీ జరగదన్నంత అభిమానం యేర్పడింది. తను యిచ్చే చనువును పిసరంతయినా స్వంతంకోసం వినియోగించుకోలేదు. పొరపాటునైనా చెప్పలేదు.

అలాంటి దుర్గాప్రసాదేనా యింత పని చేస్తున్నది? తన చెవిలో యీ విషయం ముందుగా వేస్తే యెంత బాగున్ను? ఎంతో కోపం వచ్చాక యిందులో అసలు నిజమెంతో అబద్ధం యెంతో తెలుసుకుందామని యిక్కడా అక్కడా వాకబు చేసాడు. ఈ కుర్రాడ్ని గట్టి బంధం పడకముందే రక్షించాలి. రమామణి శలవు పెట్టే సుదినంకోసం కానుక కూర్చుంటే ఆ బంధం గట్టి బంధమైతే విడపించటం కష్టం. ఒకనాడు దుర్గాప్రసాద్‌ని అందరూ వెళ్లిపోయాక ఆఫీసులోనే వుండమన్నాడు. ఏవో ఫైళ్లు అడిగి వాటిగురించి చర్చిస్తూ.

"దిగులుగా కనిపిస్తున్నావు. నీ ఆరోగ్యం బాగాలేదా? లేక మీవూర్లో మీవాళ్ల కెవరికైనా...?"

"అబ్బే — అంతా బావున్నారండీ."

"నిద్దర సరిగ్గా లేనట్లు నీ కళ్లు చెప్తున్నాయ్. ఏ నిర్ణయానికి రాలేని ఆలోచనలతో నిద్ర పట్టడంలేదా?"

దుర్గాప్రసాద్ తలదించగానే తనది పైచెయ్యి అయ్యిందని ప్రభు తలెత్తి "పెళ్లాన్ని యెంచుకున్నప్పుడు చాల జాగ్రత్త అవసరం. అందమైనవాడివి. నీకో అందమైన పెళ్లంవస్తే చూసి సంతోషిద్దామన్న వారిలో నేనొకడ్ని? మరచిపోకు"

ఇన్ని మాటలని ఒక చిరునగవు విసిరి "అబ్బే-అబ్బే నీ స్వవిషయంలో జోక్యం చేసుకుంటున్నానెందుకని అభిమానం చంపుకోలేక మా అబ్బాయికి చెప్పినట్లు యీ రెండు మాటలూ అన్నాను నీ యిష్టం."

దుర్గాప్రసాద్ "వస్తాను సార్" అని అక్కడనుంచి వెళ్లిపోయాడు. రమామణి ఆఫీసులోచేరి రెండు నెలలు కాలేదుగానీ యీ మంచివాడ్ని యే మందో మాకో పెట్టి లొక్కుంది అనుకున్నాడు ప్రభు. ఆమరుసటి రోజు దుర్గాప్రసాద్ ఆఫీసుకి రాలేదు. ఇంట్లో పెళ్లాం యెదరగా ఉపన్యాసం యిచ్చాడు. 'ఈకాలం పిల్లలకు యెవరు చెప్పగలరు? ఏంచూసి పడిపోయాడో? ఒక అందమా? ఒక చందమా?"

"ఆ అమ్మాయిలో ఏం చూశాడో?"

"ఈ అమాయకుడ్ని ఆ అమ్మాయి ఇలా దోచేయటం బాగాలేదు. కాస్త సిగ్గుతో వుంటే అందంగానీ......"

ఆ మరుచటి రోజు దుర్గాప్రసాద్ నుంచి వారం రోజులకు శలవుచీటీ వచ్చింది. తరవాత తన వూరు వెళ్లాడని తెలిసింది.

"నా కొడుకే కొరకరాని కొయ్య అనుకుంటే... అంతా యింతే— ఈ తరంవాళ్లని కంట్రోలు చెయ్యటం బ్రహ్మతరం కాదు" అన్నాడు పెళ్లాం యెదరగా.

తన పెళ్లంలో యీ వినేగుణం తనకు నచ్చింది కాబట్టి ఆఫీసు పని కాగానే సరాసరి యింటికొస్తాడు. వంట యింట్లో ఆవిడ వున్నా, యిలా చెప్పకుంటే 'మ్యావ్‌మ్యావ్' అనే పిల్లిలా ఆమె వూ కొట్టుంది కాబట్టి ఆడగి యేవాడూ పులి కాలేదని అతని ధీమా.

దుర్గాప్రసాద్ నెల రోజులకు శలవు పొడిగించగానే ఆ పని రమామణి చెయ్యవలసి వచ్చింది. వారం రోజుల్లో యీ అమ్మాయి ఆ సీటు పనంతా క్షుణ్ణంగా తెలిసినట్లు చెప్తోంది. ఈ కాలం బిఏ బోడి బిఏ అనుకున్న తన దృఢ నమ్మకాన్ని మార్చుకోవలసి వచ్చింది. ఈ అమ్మాయి రాసి పెట్టిన కొన్ని డ్రాఫ్టులు నిజానికి నమూనాలు క్రింద పెట్టుకోవచ్చు. ఆమె అందం నచ్చకపోయినా ఆమె పనితనం నచ్చింది. ఆ అమ్మాయి స్వయంగా ఫైళ్లలోని విషయాలను స్పష్టీకరణ చెయ్యడానికి తన ఆఫీసు గదిలోనికి వస్తోంది.

"ఇంతకుముందు యింకే ఆఫీసులోనైనా పని చేశావా రమామణీ?" ప్రశ్నించాడొకరోజు.

"లేదండీ"

"ఇంత బాగా రాస్తున్నావ్?"

"మా నాన్నగారు నేర్పించారండీ"

"ఆయనదీ గవర్నమెంటు సర్వీసేనా?"

"తాలూకాఫీసు హెడ్ గుమాస్తాగా రిటైరయ్యారు"

"అలాగా" అని ఆ రోజుకు చాలించి యింకోరోజు యేదో అడుగుదామనుకుంటే రమామణే అంది.

"మీ యింట్లో అమ్మాయిలు లేరా?"

"నాకు కూతుర్లు లేరు" సంతోషంగా నవ్వుతూ అంటే "పాపం! కోడలైనా లేదా?"

"ఏం? అలా అడుగుతున్నావ్?"

"మీ కోటు బొత్తాలు వూడినా యెవరూ కుట్టలేదే, మీ టై మాసినా కాస్త సర్ఫులో వేసి వుతకలేదే- మీ పొరుగునే వుంటే నేను యీ పనులన్నీ చేసిపెట్టే దాన్ని" అన్న రమామణి యింకోనాడు అటడొక్కు టేబిలుమీద పెట్టూ "మా నాన్నగారికి కోవాబిళ్లలంటే యెంతో యిష్టం. నేనే చేసాను. మీకూ యిష్టమని తెచ్చాను"

"మీ నాన్నగారు రిటైరైనా కోవా బిళ్లలు తింటున్నారా?"

"ఆయనది యెంతమంచి ఆరోగ్యమో?



ఇప్పటికీ రోజుకు రెండు మైళ్ళు షికారెళ్తారు. అందర్నీ నవ్విస్తారు. అతను లేకపోతే యింట్లో ఓ క్షణం వుండలేం."

తన తండ్రి సుగర్ కంప్లయింట్‌తో పోయాడు. అంచేతే ప్రభుకు సుగర్ అంటే భయం. ఈ అమ్మాయి యిలా తేవటం తనకు యిష్టంలేదు. ఆ అమ్మాయి అన్న కొన్ని మాటలూ తనకు చేదుగా వున్నయ్. అందుకే తేలిగ్గా అన్నాడు.

"అంత మంచి నాన్న — మరి నిన్ను పెళ్లి చెయ్యకుండా ఉద్యోగంలో యెందుకు పెట్టాడు?"

"నాకు యిష్టమని సరేనన్నాడు. ఎవరి విశ్వాసాలు వాళ్లకుంటాయి కదండీ? ఇక మీకు తెలియని మార్కెట్ కనగకా ... "నిట్టూర్పి" నన్నేం చెయ్యమంటారు? మా నాన్ననేం చెయ్యమంటారు?"

"తాలూకా ఆఫీసు హెడ్ గుమాస్తాగా వున్నప్పుడైనా ఒక చెయ్యి చాపితే..."

"ఛీ ఆ అవినీతికి పోలేదు కాబట్టే అంతా [illegible]ంగా బతుకుతున్నాం. విశ్వాసంతో [illegible]న్నాం."

"అంతా అంటే..."

"మా అమ్మ నాన్న. ఇద్దరు తమ్ముళ్లు ఒక చెల్లెలు."

"ఇంకా యింత బరువు దీ?"

దుర్గాప్రసాద్ మెడికల్ సర్టిఫికేటు పెట్టి యింకో నెల సెలవు పొడిగించాడు. "ఇది బోగస్ సర్టిఫికేట్" అని చిన్న అలజడిచేసి ఆ అభిమానం అంతా యెటో ఒకవేపు వర్షించాలిందా — రోజుకు రోజూ రమామణి పని తనంచూసి "ఈ అమ్మాయి వెర్రివేషాలేమీ వెయటంలేదు. దుర్గాప్రసాద్‌లా అలాగే సార్ అని గంగిరెద్దులా తలాడించటంలేదు. తను ఏకీభవించనిచోట వాదించి నెగ్గుకొస్తోంది. ఈ అమ్మాయికి తనకన్నా మంచి గ్రహణశక్తి, భాషపై అధికారం, మంచి చెడ్డలను బేరీజువేసే ప్రజ్ఞ ఉన్నాయి ... ఇలాంటి గుణాలున్న కూతురే తనకు ఉంటే?"

రానురాను రమామణి తన తండ్రిమీద యింట్లో యెంతటి శ్రద్ధ తీసుకుంటుందో ఆఫీసులో తనమీద అంత శ్రద్ధా తీసుకుంటుంటే ... దుర్గాప్రసాద్ శలవునించి వస్తే ఆరోజు తను కోరకుండా యిచ్చిన సలహా పాటించవద్దని చెప్దామనుకున్నాడు.

ఒకరోజు. ఇంకా దుర్గాప్రసాద్ సెలవు నించి రాలేదు. లంచి టైము. రమామణి ఒక్కర్తే ఆఫీసుగదిలో వుంది. టెలిఫోను ప్రభు గదిలో మోగింది. ఫైలు అవసరం వచ్చి ఆఫీసు గదిలోనికి వెళ్తే ఆమె యేడుస్తోంది మెల్లగా. అతనిని చూసినా ఆ కన్నీరు జలజలా యింకా రాలిపోతునే వుంది.

"ఏం జరిగింది?" ప్రశ్నించాడు. ఆమె మాటాడలేదు. ఇంతమంది మగవాళ్ల మధ్య ఒక ఆడది. ఎవరేమన్నారో? ఒక గంట పోయాక ఆమెను తన గదిలోనికి పిలిచి.

"నీ స్వవిషయమైతే చెప్పమని బలవంతం చెయ్యను. ఆఫీసులో యెవరైనా అసభ్యంగా ప్రవర్తించినట్లయితే నిన్ను రక్షించే బాధ్యత నాకున్నది. సంకోచించకుండా చెప్పు" అన్నాడు.

ఆమె మాటాడకుండా తల వంచుకుని తిరిగి వెళ్లిపోయింది. ఆ మరుసటి రోజు శలవుచీటీ వచ్చింది వారం రోజులు పొడిగించింది. వారం పదిహేను రోజులైంది. ఇద్దరి పని యెవరు చేస్తారు? ఈ కాలం వాళ్లకు పెళ్లి జుత్తులోకావు మెదడులో వుంటాయని వినుక్కుంటే ఒక వార్త వచ్చిపడింది. వార్తకాదు — దుర్గాప్రసాదు బదలఆర్డరు వచ్చిపడింది. ప్రభు వాడు కృతఘ్నుడని వాడి ముఖమే చూడదలచుకోలేదు. తనతో చెప్పకుండా యే పెద్దవాడినో పట్టుకొని బదిలీ చేయించుకున్నాడు. రిలీవింగ్ ఆర్డరు వాడి శలవు యెడ్రస్‌కే పంపాకే నిద్దర పట్టింది.

రమామణి వస్తే దుర్గాప్రసాద్ యెంత వాడో చెప్దామనుకున్నాడు. ఇద్దరూ పెళ్లి చేసుకుంటున్నారన్న చిన్న పుకారు విని గాబరా పడ్డాడు. ఆ అమ్మాయి శలవునించి తిరిగి వస్తేనా "అలాంటి చాపకింద నీరులాంటి మనిషితో వేగలేవు. వద్దు వద్దు" అని చెప్పడానికి? కొద్ది రోజుల తరవాత ఆ అమ్మాయికి పెళ్ళయిపోయిందని కూడా తెలిసింది. ఆవేళ భార్యతో "ఆ మెల్లకన్ను పిల్లకి పెళ్లయిపోయిందటే!"

"ఏ మెల్లకన్ను పిల్లండీ?"

"రమామణి"

"మెల్లకన్ను ఏరి లెండి" అంది.

అసలు కినుకు పూర్లోనే పెళ్లిచేసుకుని కనీసం ఆశీర్వదించండని తనను పిలవలేదు కదా— కనీసం ఆఫీసులో నలుగురుకి పంపినట్లు తనకి ఒక శుభలేఖ పారేయకూడదూ?

వీళ్లిద్దరూ తన రక్త సంబంధీకులా యేమిటి అనుకుని ఆ ముఖాలను మనసు నించి చెరిపేయడానికి ప్రయత్నించాడు. కొన్నాళ్లకు మరచిపోయాడు. ఒకరోజున ఒక కవరు వచ్చింది. అది విప్పి చూస్తే ఆ చేతి వ్రాత బాగా పరిచయమున్నదే... క్రింద సంతకం చూశాడు "దుర్గాప్రసాద్". అది తనకు రాయలేదు. రమామణికి రాసిన వుత్తరం. ఈనాడు కాదు — ఆనాడు ఆఫీసులో మధ్యాహ్నం ఒంటరిగా ఆమె యేడ్చినాడు ఆమె అందుకున్న వుత్తరం— పాత ఉత్తరం. చదివాడు.

"రమా! నిన్ను తప్పక పెళ్లి చేసుకుందామనుకున్నాను. నన్ను కన్నకొడుకుకన్న మిన్నగా చూసుకుంటున్న ప్రభుగారికి మన యిద్దరి పెళ్లి ససేమిరా యిష్టం లేదు. నేను గౌరవించేవాళ్లలో అతను ముఖ్యుడు. అతనికి యిష్టంలేనిపని చేస్తే బాధ పడ్తాడు. అందుచేత నన్ను మన్నిస్తావనుకుంటాను. నా ముఖం మళ్లీ యెలా చూపగలను?

దుర్గాప్రసాద్"

సీతారామప్రభువు చదివి కళ్లు నులుపుకున్నాడు.

చంద్రునిపై గాలిలో పాదరసం

చంద్రునిమీద పాదరసం ఆవిరులు గల వాయువు సన్నగా వీస్తుండివుంటుందని సోవియట్ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. లూనార్ లూనార్-20 అంతరిక్ష నౌకలు భూమికి తెచ్చిన చంద్రుని నేలమచ్చుల్ని పరిశీలించగా, లూనార్-20 తెచ్చిన మన్నులో పాదరసం ఎక్కువ కనిపించింది. ఆ మన్ను ఆ గోళంలోని ఖండభూభాగం నుంచి తెచ్చినది. మన్నులో కనిపించిన ఈ పాదరసం తేడా గాలివలన సంభవించిందని సోవియట్ శాస్త్రవేత్తల అభిప్రాయం. చంద్ర దినభాగంలో 150 డిగ్రీల వేడిలో పాదరసం ఆవిరియై గాలిలో ఖండభాగాలకు చేరి రాతులందు చల్లబడి రాళ్లల్లో స్థిరపడుతూందని వారి వూహ.